# కులసంఘాల అభ్యున్నతికి కృషి

- వేములవాడ జడ్పీటీసీ మ్యాకల రవి
- గౌడ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



అనుపురంలో గౌడ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ, నేతలు

వేములవాడ రూరల్, జూన్ 17: కులసంఘాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని వేములవాడ జడ్పీటీసీ మ్యాకల రవి పేర్కొన్నారు. వేములవాడ మండలం అనుపురంలో జడ్పీ నిధులు ₹3లక్షలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేసిన సీడీపీ నిధులు ₹3లక్షలతో గౌడ సంఘ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి మాట్లాడారు. అనుపురంలో దాదాపు పది కుల సంఘాలకు భవనాలు నిర్మించుకున్నామని, మరిన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇక్కడ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచులు వెంకటరమణ, రాజు, నాయకులు ఆగయ్య, శ్రీనివాస్, చిట్ల శ్రీనివాస్, మెర్గు శ్రీనివాస్, నర్సయ్య, రమేశ్, నర్సింహారెడ్డితో పాటు సంఘం నాయకులు ఉన్నారు.

## వేడినీళ్లు మీద పడి వృద్ధుడి మృతి

రాంనగర్, జూన్ 17: ప్రమాదవశాత్తు వేడినీళ్లు మీద పడడంతో తీవ్రగాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రామగిరి యాదగిరి భార్య భాగ్యలక్ష్మితో కలిసి నగరంలోని సప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఈ నెల 7న యాదగిరి స్నానం చేసేందుకు నీళ్లు వేడి చేసుకుని తీసుకు వెళ్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. వేడి నీళ్లు ముఖం, శరీరంపై పడి బొబ్బలు రావడంతో కుటుంబ సభ్యులు ముందుగా కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాదగిరి (64) సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

## రెండిళ్లలో చోరీ

ముస్తాబాద్, జూన్ 17: చిప్పలపల్లి గ్రామంలో ఆదివారం తాళం వేసి ఉన్న రెండు ఇండ్లల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిచర్ల నర్సవ్వ, గాడిచర్ల నరేశ్ కుటుంబ సభ్యులు వారి ఇండ్లకు తాళాలు వేసి బంధువు ఇంటికెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలను పగలకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. నర్సవ్వ ఇంట్లో రూ.1.85 లక్షలు, తులం వెండి, నరేశ్ ఇంట్లో విలువైన బంగారు, వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ శేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్, జూన్ 17: మర్రిపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల (2014-15లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. పదేండ్ల తర్వాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. చిన్ననాటి స్నేహితులతో రోజంతా సంతోషంగా గడిపారు. ఇక్కడ అధ్యాపకులు ఉమామహేశ్, లచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కట్కం మల్లేశం, తదితరులు ఉన్నారు.

## నేడు 'ఫ్లాష్ బ్యాక్ సమ్మిట్ 2024'

విద్యానగర్, జూన్ 17: ఫ్లాష్‌బ్యాక్ ఏ1 ఆధారిత ప్రొఫెషల్ వెడ్డింగ్ ప్రోడక్ట్ ఫ్లాష్ బ్యాక్ ప్రోమోను మంగళవారం కరీంనగర్‌లోని కమాన్‌రోడ్‌లో గల హోటల్ పికాక్ రెస్టారెంట్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సమ్మిట్‌ను తెలుసుకోవడానికి 250 మంది కంటే ఎక్కువ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఫ్లాష్‌బ్యాక్ అనేది కరీంనగర్ ఆధారిత ఏ1 స్టార్టప్ అని, వివాహ పరిశ్రమలను ప్రభావితం చేసే ఒకరకమైన సోషల్ మీడియా అని వారు తెలిపారు. ఫ్లాష్ బ్యాక్‌ను బూట్‌స్ట్రాప్ చేయడానికి స్థాపించినట్లు పేర్కొన్నారు.



గంభీరావుపేట: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ



వేములవాడ టౌన్: విప్ ఆది శ్రీనివాస్‌కు స్వీటు తినిపిస్తున్న ముస్లింలు

# త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

*జిల్లా వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా పేదలకు దానధర్మాలు చేశారు. త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని.. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకొంటారని మత పెద్దలు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, గంభీరావుపేట మండల కేంద్రంలోని ఈద్గాలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.*

*– వేములవాడ టౌన్/ ఎల్లారెడ్డిపేట/ ఇల్లంతకుంట/కోనరావుపేట/ముస్తాబాద్/ గంభీరావుపేట/ సిరిసిల్ల రూరల్, జూన్ 17*



కోనరావుపేట: బావుసాయిపేటలో బక్రీద్ వేడుకలో ముస్లింలు



ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# సెలవుల్లో ఈవో

- ఉత్తర్వుల ప్రకారం తిరిగివెళ్లిపోయిన ఇన్‌చార్జి ఈవో
- సోమవారం కావడంతో.. కిక్కిరిసిన రాజన్న క్షేత్రం
- స్వామివారి దర్శనానికి భక్తుల అష్టకష్టాలు

వేములవాడ. జూన్ 17: వేములవాడ రాజన్న ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తగా, ఆలయ కార్యనిర్వహణ అధికారి తీరుతో భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయ ఈవో సెలవుల్లో ఉండడం.. ఇన్‌చార్జిగా వచ్చిన ఈవో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తిరిగి వెళ్లడంతో ఆలయ ఉద్యోగులు ఆశ్చర్యానికి గురయ్యారు. అసలు విషయానికి వస్తే.. వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వైద్య సేవల కోసం గత మే 24 నుంచి జూన్ 5వరకు సెలవు తీసుకున్నారు. తన ఆరోగ్యం కుదుటపడక పోవడంతో ఈ నెల 16వరకు సెలవుల గడువును పొడిగించుకున్నారు. ఈ సెలవుల కాలానికి హైదరాబాద్ కార్యాలయానికి చెందిన ఆర్‌జేసీ రామకృష్ణకు రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పని చేసిన రోజుల్లో మాత్రం ఈవో రామకృష్ణ తనదైన శైలిలో ముద్ర వేశారు. వసతి గతులు, భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహిస్తూ.. ఉద్యోగుల పనితీరుపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఆదివారం వరకు కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తన విధులు ముగిశాయని ఆయన సాయంత్రమే హైదరాబాద్‌కు తిరిగివెళ్లారు. ప్రతి రోజూ వేలాదిగా తరలివచ్చే భక్తులతోపాటు 400మందికి పైగా ఉద్యోగులు ఉన్న రాజన్న ఆలయానికి ఈవో కృష్ణప్రసాద్ విధుల్లో చేరకముందే.. ఇన్‌చార్జి ఈవో తన విధులు ముగిశాయని వెళ్లిపోవడంతో ఆలయ ఉద్యోగులు ఆశ్చర్యానికి గురయ్యారు. సోమవారం రాజన్న సన్నిధికి 50వేలకు భక్తులు పోటెత్తగా, సరైన వసతులు లేక ఇబ్బందిపడ్డారు. ఈ విషయమై పర్యవేక్షకుడు అరుణ్‌ను వివరణ కోరగా, ఆదివారం వరకే ఇన్‌చార్జి ఈవో సెలవు ముగిసిందని, మంగళవారం ఈవో కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.



స్వామివారి దర్శనం కోసం ఆలయం ముందు భాగంలో భక్తులు

## పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్ జూన్ 17: మొర్రాయిపల్లె గ్రామంలో ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన మోతె రాజు సోమవారం పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేయగా, ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దు



బీసీఎం దవాఖానలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో డాక్టర్ అనూషరెడ్డి

బోయినపల్లి, జూన్ 17: కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని కొదురుపాక బీసీఎం కంటి దవాఖాన వ్యవస్థాపకుడు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు వైరాగ్యం రాజలింగం-రీటాబహదుర్‌షా దంపతులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వరకు కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో 32మందికి కంటి ఆపరేషన్ చేశారు. సోమవారం ఉదయం వారందరికీ కంటి పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే వెంటనే కొదురుపాకలోని బీసీఎం కంటి దవాఖానకు తీసుకురావాలన్నారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి వారికి చూపు అందిస్తామని చెప్పారు. ఇక్కడ డాక్టర్ బిల్ల అనూషరెడ్డి, కౌన్సిలర్ రాజు, బీసీఎం సిబ్బంది ఉన్నారు.

# టర్పాలిన్లు అందజేత



టర్పాలిన్లను అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీకుమార్

కోనరావుపేట, జూన్ 17: మరిమడ్లకు చెందిన పలువురు గ్రామస్తులకు రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ టర్పాలిన్లు అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలువురి పెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం కాగా, వాటిపై కప్పేందుకు టర్పాలిన్లు అందించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ సొసైటీ సభ్యులు సునీల్, వేణు, గ్రామస్తులు జింక శ్రీనివాస్, కుమ్మరి దిలీప్, తదితరులు ఉన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జడ్పీటీసీ, నాయకులు

## ఉచిత వైద్య శిబిరం

రుద్రంగి, జూన్ 17: రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల కోసం 19రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక్కడ చెలుకల తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

## ఎల్ఐసీ డీవో మృతి

వేములవాడ, జూన్ 17: వేములవాడ పట్టణానికి చెందని ఎల్ఐసీ డీవో మోకిరాల ఆంజనేయులు(56) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని బంధువులు చెప్పారు. కొన్నేండ్లుగా ఆయన వేములవాడలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారిగా సేవలందించారు. ఈ క్రమంలో ఆయన మృతి చెందడంతో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

వేములవాడ, జూన్ 17: పట్టణంలోని మహాలక్ష్మి వీధి సబ్‌స్టేషన్ మరమ్మతులో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ సిద్దార్థ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని మొదటి బైపాస్, రెండో బైపాస్, జాతర గ్రౌండ్‌లోని కొంతభాగం, తిప్పాపూర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ముస్తాబాద్/బోయినపల్లి, జూన్ 17: జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం బంధనకల్ శివారులో సిద్దిపేట- ముస్తాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాతి రోడ్డు ప్రమాదం జరిగింది. మిర్చి లోడ్‌తో వస్తున్న బొలెరో వాహనం, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ప్రయాణిస్తున్న దుబ్బాక మండలం పెద్దచీకోడుకు చెందిన కొంగర కిష్టారెడ్డి, ఆయన సోదరుడు రాంచంద్రారెడ్డి భార్య మంగమ్మకు తీవ్ర గాయాలు కాగా, బొలెరో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కిష్టారెడ్డి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మంగమ్మను దవాఖానలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కొదురుపాక వద్ద లారీ, కారు ఢీ


బోయినపల్లి మండలం కొదురుపాక రింగ్‌రోడ్ వద్ద సోమవారం లారీ, కారు ఢీకొన్నాయి. లారీ డ్రైవర్ బ్రేక్ వేయగా త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. కరీంనగర్ వైపు నుంచి వేములవాడకు లారీ వెళ్తుండగా, కొదురుపాక రింగ్‌రోడ్డు వద్ద లారీ ముందు నుంచి అనుకోకుండా కారు రోడ్డు దాటుతుండగా, వేగంగా వస్తున్న లారీ కారును స్వల్పంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ బ్రేకులు వేయగా దాదాపు 10 గజాల దూరం నుంచి లారీ నిలిచిపోయింది. దీంతో కారుకు తగిలింది కానీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి బదిలీ

కోనరావుపేట, జూన్17: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నాలుగేండ్లుగా విధులు నిర్వర్తించిన ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి గంభీరావుపేటకు బదిలీయ్యారు. విధులు సక్రమంగా నిర్వర్తించి మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించిన ఏఎస్ఐని ఎస్ఐ ఆంజనేయులు ప్రశంసించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు.



పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది



ఎల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## బాధిత కుటుంబాలకు విప్ పరామర్శ

కోనరావుపేట, జూన్ 17: నిమ్మపల్లిలో విక్కుర్తి ఎల్లయ్యగౌడ్, మామిడిపల్లిలో బడుగు కిరణ్, వట్టిమల్లలో దాదె ముత్తవ్వ, జెట్టి రాజయ్య, కనగర్తిలో సోలుపాటి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఇక్కడ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, మండలాధ్యక్షుడు పాషా, మాజీ వైస్ ఎంపీపీ కచ్చకాయల ఎల్లయ్య, నేతలు బైరగోని నందుగౌడ్, నంద్యాడపు సాగర్, ఎల్లాల లింగారెడ్డి, తాళ్లపల్లి ప్రభాకర్, జెట్టి అంజయ్య ఉన్నారు.

### విప్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

వేములవాడ, జూన్ 17: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం ఆయన నివాసంలో జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ సమీమ్ద్దీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో నీలారపు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## కరెంట్ వైర్ చోరీకి యత్నం

- పట్టుకున్న గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత

వేములవాడ రూరల్, జూన్ 17: మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ సమీపంలోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న వైర్లను ఓ వ్యక్తి దొంగతనం చేస్తుండగా, గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా చందూరు మండలం విరగుంట గ్రామానికి చెందిన గుండరం గంగారం అనే వ్యక్తి తిప్పాపూర్‌కు చెందిన గడ్డం కృష్ణ, మైలారం శ్రీనివాస్, గడ్డం సాయి, గడ్డం ఎల్లయ్య, రెడ్డికాలనీ మంచినీటి బావి వద్ద ఉన్న మోటర్ వైర్లను దొంగలించగా పట్టుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలించిన వైర్లతో పాటు గంగారంను పోలీసులకు అప్పగించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.